www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శుక్రవారం

06 జూన్ 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



## నిధుల సమీకరణపై దృష్టిపెట్టండి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు కోసం అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆ కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శాఖల వారీగా అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఇకపై రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ప్రతివారం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ నిర్ణయాల అమలు ప్రగతిపై వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ కు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేక అధికారిని నిర్మించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజు, ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ,సి సి ఎల్ ఏ సెక్రటరీ నవీన్ మిట్టల్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ , కమిషనర్లు హరిత, హరికిరణ్, విష్ణువర్ధన్, సురేంద్రమోహన్, బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఇలంబర్తి , ఆర్ వి కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి

### ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి



కలంజ్యోతి, హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందని తెలిపారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందామని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించే ప్రతిజ్ఞ తీసుకుందామని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన సీఎంవో కార్యాలయం ద్వారా ఒక సందేశం విడుదల చేశారు. సహజ వనరుల సంపదను రాబోయే తరాలకు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ ధృక్పథమని పేర్కొన్నారు.



# కొలువుదీరిన రామయ్య

- అయోధ్య రామ దర్బార్ కు ప్రాణప్రతిష్ఠ
- పాల్గొన్న సీఎం యోగి ఆదిత్యనాథ్
- సీత, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమ విగ్రహాలకూ ప్రాణప్రతిష్ఠ

2లో



## రైస్ మిల్లుల పరిశీలన..

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ధాన్య నిల్వలపై జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ ఆరా తీశారు. రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్య దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వర్షాలకు ముందే ధాన్యం దిగుమతి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీ సద్గురు రాఘవేంద్ర పారాబైల్డ్ రైస్ మిల్ ను తనిఖీ చేసిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైస్ మిల్లు కు రోజుకు ఎంత ధాన్యం చేరుతుందని, రోజు ఎంత మొత్తంలో వచ్చిన వరి ధాన్యాన్ని బియ్యంగా మారుస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

## కూతురుపై లైంగికదాడి కేసులో 20ఏళ్ల జైలు శిక్ష

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో 2021లో ఆరేళ్ల మైనర్ కూతురిపై లైంగికదాడి చేసిన కేసులో ఆ నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శ్రీవాణి గురువారం తీర్పునిచ్చారు. 2021 లో సోన్ మండలంలో ఓ గ్రామంలోని తన ఇంట్లో ఉన్న ఆరేళ్ల చిన్నారిని భార్య ఇంట్లో లేని సమయంలో నిందితుడు లైంగికదాడి చేశాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో సాక్షులు లేకపోవడం అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి, డీఎస్పీ ఉపేందర్ రెడ్డి సాంకేతిక సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి శ్రీవాణి ఈ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.జానకీషర్మిల మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పిన తల్లీ కూతుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్ రెడ్డి, విచారణా అధికారి డిఎస్పీ ఉపేందర్ రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు డల్లుసింగ్, భాస్కర్, ప్రభాకర్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## గుంతల రోడ్ల పరిశీలన

**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ లోని విశ్వనాథ గార్డెన్ నుంచి హెచ్ ఎంటీ స్వర్ణ పూరి కాలనీ, వెళ్లే రహదారి వెంబడి రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడిన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహ నదారులు ఫిర్యాదు చేయడంతో బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ గురువారం జానప్రియ వేస్ట్ సిటీ ఏర్పడిన గుంతలను పరిశీలించారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరారు. వర్షాకాలం వచ్చినందు వల్ల గుంతలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని, వాహనదారులు ప్రమాదాల భారిన పడే అవకా శం ఉన్నందువల్ల అధికారులు వీలైనంత తొందరగా స్పందించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని డిమాండ్ చేశారు.

# కొలువుదీరిన రామయ్య



**అయోధ్య :** అయోధ్య తొలి అంతస్థులో రామ దర్బార్ రామయ్య కొలువుదీరారు. వైభవోపేతం, కన్నులపండువగా శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణ, భరత, శత్రఘ్న, హనుమంతుల విగ్రహాలకు ప్రాణప్రతిష్ట జరిగింది. గురువారం ఉదయం 11.25 నిమిషాల నుంచి 11.40 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిరంలోని మొదటి అంతస్తులో 101 మంది ఆచార్యులు మంత్రోచ్చారణలు, ఆచారాలను పాటిస్తూ పవిత్రోత్సవాన్ని నిర్వహించారు. 2024 జనవరి 22న అయోధ్యలో జరిగి ప్రాణ ప్రతిష్ట వేడుకల్లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా తన భార్యతో కలిసి ప్రధాన హోస్ట్ గా వ్యవహరించారు. ప్రస్తుతం కూడా అనిల్ మిశ్రా మొదటి అంతస్థులో ఏర్పాటు చేసిన శ్రీరామ ప్రాణ ప్రతిష్టలో రెండోసారి హోస్ట్ గా వ్యవహరించారు. సూరత్ కు చెందిన ముఖేష్ పటేల్ అనే వ్యాపారవేత్త చార్టర్డ్ విమానంలో తీసుకువచ్చిన వజ్రాలు పొదిగిన బంగారం, వెండి ఆభరణాలను భారీ ఎత్తున విరాళంగా అందజేశాడు. 11 కిరీటాలు వెయ్యి క్యారెట్ల వజ్రం, 30 కిలోల వెండి, 300 గ్రాముల బంగారం, 300 క్యారెట్ల రూబీతో ఆభరణాలు తయారు చేశారు. శ్రీరామ, సీతమ్మతోపాటు నలుగురు సోదరులు, హనుమంతుడికి కూడా పలు ఆభరణాలను అందజేశారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 350 మందిని మాత్రమే ఆహ్వానించారు. దేవాలయ ట్రస్ట్ అధికారులు, సాధువులు, విగ్రహాలను తయారు చేసిన వారు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖులు ఉన్నారు. గంగా దసరా సందర్భంగా జరిగిన ఈ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ పుట్టినరోజు కూడా కావడం విశేషం. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున అయోధ్యకు భక్తులు చేరుకోగా ట్రస్ట్ అధికారులు పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్యలోని వీధులన్నీ శ్రీరామనామస్మరణతో మారుమోగుతున్నాయి. ఆలయ పరిసరాలు, అయోధ్యకు దారితీసే దారులన్నీ అలంకరణలో, రంగోలి, దీపాల కాంతులతో వెలుగులీనుతున్నాయి.

# కొండగట్టు వద్ద పెండ్లి బృందం కారును ఢీ కొట్టిన వ్యాన్

- వరుడుతో పాటు ఆరుగురికి తీవ్ర గాయాలు
- 4 నెలల బాలుడు మృతి
- నిలిచిపోయిన వివాహం

**కలంజ్యోతి , మల్యాల :** పెండ్లి ప్రయాణంలో అనుకోని ప్రమాదంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. తెల్లవారితే కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో పెండ్లి.. వరుడుతో పాటు కుటుంబ సభ్యులు కారులో నాందేడ్ నుండి బయలు దేరారు. తెల్లవారు జామున కొండగట్టు ప్రాంతం లో రోడ్డు ప్రమాదం జరగడంతో 4 నెలల బాలుడు మృతి చెందగా, వరుడితో పాటు మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... మహారాష్ట్ర నాందేడ్ లోని చిక్కల్వాడి గ్రామానికి చెందిన చెందిన మేత్కర్ హరి పెద్ద కొడుకు మహేష్ వివాహం కావడంతో గురువారం రాత్రి ఎంహెచ్ 46 బీవై 4332 ఎర్టిగా కారులో హుజు రాబాద్ వెళ్తున్నారు. కారులో వరుడుతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ క్రమంలో తెల్లవారు జామున 4 గంటల సమయంలో మల్యాల మండ లం కొండగట్టు ప్రాంతంలోని శ్రీ పంచముఖ హనుమాన్ విగ్రహం సమీపంలో ఎదురుగా మామిడి కాయల లోడ్ తో వస్తున్న డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న బాలుడు వాగ్మేరీ రుద్ర (4 నెలలు) అక్క డికక్కడే మృతిచెందగా, వరుడు మహేష్ మేత్కర్ తో పాటు వాగ్మేరీ దినేష్ అతడి భార్య శీతర్, వాగ్మేరీ మారుబాయ్, మరో బాలుడు కార్తీక్, పొడే లింగమ్మ, డ్రైవర్ కర్మే చందులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో జగిత్యాల ఏరియా హాస్పిటల్ కు తరలించారు. గాయపడిన వారు చికిత్స అనంతరం తిరిగి నాందేడ్ వెళ్లిపోయారు. వరుడి తండ్రి ఫిర్యాదు మేరకు డీసీఎం వ్యాన్ డ్రైవర్ కయుంఖాన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు. కాగా, అనుకోని ఘటనతో పెండ్లి నిలిచిపోయింది.

కలంజ్యోతి 3
శుక్రవారం 06.06.2025 General News

## ఘనంగా ఎమ్మెల్యే సత్యమన్న

# జన్మదిన వేడుకలు




**కలంజ్యోతి, మల్యాల :** మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే సత్యమన్న జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలం కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ వద్ద ఇందిరమ్మ లబ్ధిదారులు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగడి బజార్ నుంచి బ్లాక్ చౌరస్తాలోని సోనియమ్మ గుడి వరకు అధిక సంఖ్యలో నాయకులు అభిమానులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ... జై సత్యమన్న అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు దొంగ ఆనందరెడ్డి , జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ , దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు శనిగారపు తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు ముత్యాల రామలింగారెడ్డి, తోట్ల చంద్రశేఖర్, మ్యాక లక్ష్మణ్, అగంతపు వంశీ రవళి, కొండగట్టు డైరెక్టర్ కంచర్ల లక్ష్మణ చారి, కనకట్ల జలంధర్, ముప్పరపు సాగర్, కొలకని మారుతి, స్వామిరెడ్డి , నేరెళ్ళ సతీష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, దిండు ప్రవీణ్, ఎండి ఇమామ్, మల్లయ్య, బుచ్చిరెడ్డి, శంకర్ గౌడ్, నక్క అనిల్, కట్కూరి ప్రశాంత్, వీరాబత్తిని ప్రసాద్, కొట్టేపల్లి బాబు, జాఫర్, తాళ్ల హరినాథ్, బాలే శ్రీనివాస్, దూడం రామాంజనేయులు, కొండబత్తిని అనిల్ కుమార్, దూస వెంకన్న, బట్టు విజయ్, బివి రమణ, బండి రవి, సాయి, చైతన్య, వంశీ, రమేష్, నరసింహారెడ్డి, కిషన్ రెడ్డి, అలంకర్, హరీష్, ఆదిత్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపాలిటిలో

# ఏసీబీ దాడులు



**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ మున్సిపాలిటీలో గురువారం సాయంత్రం లంచం తీసుకుంటుండగా ఇంచార్జి రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్, బిల్ కలెక్టర్ షోయబ్ ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ కు చెందిన వ్యక్తి ఒకరు ఇంటికి సంబంధించిన మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా ఇంచార్జి రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సంతోష్, అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్ షోయబ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ప్రతి ఏటా ఒకరో, ఇద్దరో ఇలా ఏసీబీ వలలో చిక్కుకోవటం ఆనవాయితీగా మారింది. అయినా ఉద్యోగుల తీరులో మార్పు లేదు.



## కొండగట్టు అంజన్న ఆలయంలో

# విజిలెన్స్ తనిఖీలు

**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీఐ ప్రశాంత్ రావు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదాల తయారీ కేంద్రాన్ని పలు దుకాణాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో 202324, 20242025 వరకు రికార్డులను పరిశీలించారు. తమ తనిఖీలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



## గ్రామీణ క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సహం అందించాలి

### స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ అజీమ్..

**కలంజ్యోతి, చందుర్తి :** గ్రామీణ క్రీడలకు, క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజీమ్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఎల్ సీజన్ త్రీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అజీమ్ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. తద్వారా శారీరకంగా దృఢంగా ఉండడానికి క్రీడలు దోహదపడుతుందన్నారు. గత కొన్ని ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో క్రీడా స్టేడియాలు ఏర్పాటు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైతున్నాయన్నారు. అనంతరం బహుమతుల దాత మర్రి రమేష్, నిర్వాహకులు గుగ్గిళ్ళ సాగర్ ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.



## మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

### డాక్టర్ రుబీనా

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రుబీనా అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వంగర ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించి,పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం, కాలుష్యరహిత సమాజాన్ని అందించిన వారమౌతమన్నారు. భూమిపై పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి చెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని సూచించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## సొంతింటి కల తీర్చేవే ఇందిరమ్మ ఇళ్లు

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతున్నదని జీపీ కార్యదర్శి మహమ్మద్ శంషుద్దీన్ తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పాత మగ్దుంపురంలో చేపట్టారు ఇంటి నిర్మాణానికి శంషుద్దీన్ ముగ్గు పోసి, లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ననుమాస వీరస్వామి, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు పోలేపల్లి భిక్షపతి, అలువాలా శ్రీను, బండారు సత్యం, ననుమాస కరుణాకర్, ఆకుల అశోక్, శంకేష్, రంజిత్ కుమార్, పర్షనాయక్, తండ కార్యదర్శి షేక్ రజాక్, గ్రామపంచాయతీ సిబ్బంది నాంపల్లి కుమార్, కల్వచర్ల సాంబయ్య, ఐలుమల్లు రాజు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం : గుండేటి రవితేజ



**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీర్పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామానికి చెందిన గర్భిణికి అత్యవసర సమయంలో రక్తం అవసరం కావడంతో సమాచారం అందుకున్న మల్యాల మండల కేంద్రానికి చెందిన గుండేటి రవితేజ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మల్యాల బ్లడ్ డోనార్స్ తరుపున గుండేటి రవితేజకి కృతజ్ఞతలు తెలిపారు.



## ఇందిరమ్మ ఇండ్లతో పేదింటి కళ సాకరం

### మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కళ సాకారమవుతుందని నియోజకవర్గ నాయకులు మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి అన్నారు. మండలంలోని ఝల్లి గ్రామ మాజీ సర్పంచ్ జరుపుల మారిబిక్షం కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి పేద వాడి కళ నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు. అర్హులైన ప్రతి పేద వాడికి ఇల్లు తప్పకుండా 4 విడతల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. లబ్ధిదారులు అంబాల స్వరూప, జరుపుల బాలు, బోడ కిషన్ కు ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోగరు చెన్నారెడ్డి, గ్రామ పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలునాయక్, సీనియర్ నాయకులు అంబాల రవి, అమీనాబాద్ సొసైటీ డైరెక్టర్ కొమ్ములు, గంధం బాలరాజు, జక్క వెంకన్న, యాకుబ్ పాషా, అంబాలా రంజిత్ కుమార్ పాల్గొన్నారు.



## సో.. క్యూట్..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ దూసుకుపోతుంది. 'పుష్ప 2' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆమె ఇప్పుడు ఎడతెరిపి లేకుండా వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా ఉంటోంది. అలాగే నిత్యం సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. లేటెస్ట్ ఫొటోషూట్స్‌తో ఫాలోవర్స్ ను మోస్మరైజ్ చేస్తుంటుంది. ఈ క్రమంలో ఈముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. తాజాగా రష్మిక తన ఇన్‌స్టాలో ఓ స్టోరీ పోస్ట్ చేసింది. అందులో తన చిన్ననాటి ఫొటోను షేర్ చేస్తూ 'నేను అండ్ నేచర్.. గో వే బ్యాక్.. కొన్ని ఎన్నేళ్లయినా చేంజ్ కావు.. హ్యాపీ ఇన్విరాన్‌మెంట్ డే' అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారాయి. ఇక దీన్ని చూసిన నెటిజన్లు వావ్.. ఎంత క్యూట్ ఉన్నావు రష్మిక అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఇంకెందుకు ఆలస్యం ఈ ముద్దుగుమ్మ చిన్ననాటి ఫొటోను మీరు కూడా ఓ సారి చూసేయండి.